# యాదృచ్ఛికం

## పైడిశ్రీ

ఉదయం తొమ్మిదింబావుతోంది సమయం.

బస్టాప్‌లో నిలబడ్డ ప్రతి ఒక్కరి లోనూ ఆదో రకమైన కంగారు. బస్సులు లేటుగా నడవడం మీద కాసిన్ని కామెంట్లు, జోకులు, నిట్టూర్పులు, నిష్ఠూరాలు పొగల్లా రేగి పోయి పోయి ఎక్కడో కలిసిపోయినయ్.

రాజీ, రజనీష్ ఒకేసారి వాచీల వేపు చూసుకున్నారు.

కాలం మహా వేగంగా కదిలిపోతూంది.

ఏమీ తోచనట్టు ఆకాశం కేసి చూసిన రజనీష్‌కి ఒళ్ళు విరుచుకు లేస్తున్న మేఘాలు కనిపించాయి.

"ఈ రోజు వర్షం వచ్చేట్టుంది." జనాంతికంగా అన్నాడు రజనీష్.

"వస్తే రానివ్వండి—ఇప్పుడేమిటి బాధ? వర్షాల్లేక రైతులు అల్లాడుతున్నారు." ఎవరో ఒకాయన అన్నాడు విసుగ్గా. ఆయన అంత విసుక్కోవలసిన కారణమేమిటో అర్థంగాక రాజీవేపు కించిత్తాశ్చర్యంగా చూశాడు రజనీష్.

"ఈ రోజు సాయంత్రం కనక వర్షం వచ్చేట్టయితే మనం ఆఫీసులో జాగరణ చెయ్యాల్సిందే." అతనే అన్నాడు.

"ఏం? ఎందుకని?" అడిగింది రాజీ.

"సిటీ బస్సులు పడవ్వుగా ఆ రూట్లో."

"రిక్షా లేక్లనూ?"

"రిక్షా వాడు అడిగే బాడుగ చెల్లించాలంటే ఆ టైమ్‌లో మన జీతాలుకూడా చాలవు. అంత దురాశాపరులు, అవకాశవాదులు ఘరాకెళ్ళు ఉండరంటే నమ్మండి." రోడ్డు చివరికి చూస్తూ అన్నాడు రజనీష్.

బస్సు వస్తూ కనిపించింది.

అంతటితో సంభాషణ కట్టయిపోయింది.

పలుగురితో తోటుతోసుకుంటూ,రొప్పుకుంటూ బస్సెక్కారు రాజీ రజనీష్‌లు.

ఆ ఇద్దరూ ఒకే ఆఫీసులో పని చేస్తూండడం వల్ల, దాదాపు ఇద్దరిదీ ఒకే పేట కావటం వల్ల పూరునుంచి కాస్తంత దూరం వెళ్ళి ఉద్యోగం చేసే ఆ ఇద్దర్లోనూ ప్రాంతీయాభిమానం కట్టలు తెంచుకుంది. ఆ ఇద్దరికీ ఆఫీసులోనే పరిచయం. ఆ ఇద్దరిదీ ఒకే పేటని తెలిసింది అక్కడే. అప్పటి వరకూ ఎవరూ ఎవరికీ తెలీదు. అనుకోకుండా ప్రతిరోజూ ఇద్దరూ ఒకే ఆఫీసులోంచి బయటికి రావడం, ఒకే బస్ కోసం ఎదురుచూడ్డం, ఒకే బస్టాప్‌లో దిగడం పరిపాటయిపోయింది. ఒకే ఆఫీసులో కలిసి పని చేస్తున్నప్పుడు స్నేహానికి ఆడ, మగ తేడా ఉండకూడదనుకుంది రాజీ. అందుకే అతనితో కావాలనే పరిచయం పెంచుకుంది. అందుకు రజనీష్ ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. కానీ రాజీ అతన్ని 'అన్నయ్యగారూ' అని పిలవడమే సహించలేకపోయాడు. అయినా పైకి ఏమీ చెప్పలేకపోయాడు. రానురాను తానూ ఆపిలుపుకు అలవాటు పడిపోయి పవిత్ర ప్రవర్తనకు కట్టుబడ్డాడు. ఆ తరవాత తనని చూసి తనే ఆశ్చర్యపడ్డాడు, ఆమెతో అలా సోదర భావంతో మెలగగలుగుతున్నందుకు.

ఆరణి సెంటర్లో బస్సాగ్గానే రాజీకి సీటు దొరికింది. తన పక్కనే నిలబడి ఉన్న రజనీష్‌కి అందులోనే రవంత చోటివ్వబోయింది కాని, చుట్టూ ఉన్న జనం వేపోసారి చూసి తన ప్రయత్నం విరమించుకుంది.

ఆమె భావాన్ని పసిగట్టినట్టు చిన్నగా నవ్వాడు రజనీష్. అతని వేపే లిప్తపాటు పరిశీలనగా చూసింది రాజీ. ఎందుకో ఆమె స్మృతిపథంలో చటుక్కున మెరిసింది శైల.

శైల!

తమ ఇద్దరి మధ్య ఉన్న చనువును నిరసించిన శైల.

రజనీష్ వ్యక్తిత్వాన్ని శంకించిన శైల.

అతనితో స్నేహాన్ని తుంచేసుకోమని తనని బాధించిన శైల.

కిటికీలోంచి దూరంగా చూస్తూండగా ఆమె మనస్సు రెణ్ణెల్ల వెనక్కెళ్ళిపోయి ఒక ఆదివారం మీద ఆగిపోయింది.

ఆ రోజు ఆఫీసుకు సెలవు కావటంతో ఇంటి వద్దే ఉండిపోయింది ఏదో నవల చదువుకుంటూ. అనుకోకుండా ఆ గదిలో అడు గెట్టింది శైల. హేండ్‌బాగ్ విలాసంగా వూపుకుంటూ.

ఆదరంగా ఆహ్వానించింది.

రాజీ బెడ్‌మీద సగం వాలిపోతూ, "ఏయ్, మొద్దూ, నీ కెన్నిసార్లు చెప్పేనే అతనితో అంత చనువుగా తిరగొద్దని" అంది శైల. ఆమె గొంతులో సీరియస్‌నెస్ కన్నా మందలింపు ఎక్కువ భాగం ఇమిడి ఉంది.

"ఎవరితోనే?" నవల మూసేస్తూ అంది రాజీ.

"ఇంకెవరు? ఆ రజనీష్‌తో."

"ఏం అతనితో చనువుగా ఉంటే...?"

"చనువుగా ఉంటే ఏం అంటున్నావా? కొన్నాళ్ళు పోయాక చావడానికీ, బతకడానికీ స్వేచ్ఛ లేని జీవితం మిగుల్చుకుంటావు— జాగ్రత్త."

"అతను మంచివాడు కాదనేగా నీ ఉద్దేశం?"

"అతనొక్కడే కాదు—ఈమగవాళ్ళంతా అంతేనని నా విశ్వాసం. ఇలా అంటున్నానని నన్ను శంకించేవు సుమా! అటువంటిదేం లేదు. నిజానికి తప్పు మగాళ్ళది కూడా కాదు— క్షణానికో రకంగా మారుతున్న కాలానిది, ప్రపంచానిది."

"అత నలాంటి వాడు కాదనీ, నన్ను సొంత చెల్లెలి మాదిరి చూసుకుంటున్నాడని ఎన్ని మార్లు చెప్పానే నీకు? అయినా ఇప్పు డేమయిందని ఇంత రాద్ధాంతం?"

"ఏదో అయిందని కాదు. ఏమీ కాకూడదనే ఈ రాద్ధాంతం? ఏదో అయ్యాక ఏడుస్తూ కూర్చోవడం కంటే ఏమీ కాక ముందే తప్పించుకోవడం వివేకం అనిపించుకుంటుంది. ఏమంటావ్?" ఒక రకంగా గెలుపు తన వేపే ఉన్నట్లుగా నవ్వింది శైల.

"రజనీష్ ఎంత మంచివాడో నీకు తెలిస్తే ఇలా మాట్లాడవే, శైలా. చాలాసార్లు గమనించాను. పొరపాట్న నే నెప్పుడయినా 'అసభ్యంగా ప్రవర్తించినా దాన్ని సింపుల్‌గా తీసుకుని సున్నితంగా మందలిస్తాడు. తోడబుట్టిన వాడి మాదిరి హితబోధ చేస్తాడు. రియల్లీ హి ఈజ్ ఎ గుడ్ ఫ్రెండ్!" అంది రాజీ నెయిల్ పాలిష్‌నే అన్యమనస్కంగా విమురుకుంటూ.

"అతన్ని చెడ్డవాడనట్లేదు, రాజీ. కానీ పరిస్థితులనేవి మహా చెడ్డవి, మరింత దొడ్డవీను. రజనీష్ నీకు తోడ బుట్టిన వాడు కావచ్చు. మీ ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో పని చేస్తూండవచ్చు. ఒకే బస్సెక్కి వస్తూండనూ వచ్చు. మీ ఇద్దరి మధ్య పవిత్రమైన స్నేహం తప్ప మరో దురుద్దేశం గానీ, అక్రమ సంబంధం గానీ లేకపోవచ్చు. కానీ మీ ఇద్దర్నీ పొద్దుగూకులూ గమనిస్తుంటుందే లోకం, ఆ లోకం మీ పాలిటి శాపం కావచ్చు. ముఖ్యంగా నీ పాలిటి నరకం కావచ్చు. ఆ విషయం గుర్తుంచుకో."

"అన్నా చెల్లెళ్ళు కలిసి పోతుంటే అక్రమ సంబంధాలంటగట్టే మాట్లాడే లోకం ఏమనుకుంటేనా కేం? మా ఇద్దరి మధ్య ఉన్న పరిచయం లోని నిజానిజాలు నా మనస్సాక్షికి తెలును." మొహం చిన్నబుచ్చుకుంటూ అంది రాజీ.

"ఇంత వయస్సొచ్చినా ఈ లోక నైజాన్ని అర్థం చేసుకోలేకపోయిన నీ అజ్ఞానానికి సిగ్గు పడుతున్నావే, రాజీ. ఈ లోకం సంగతి నీకు తెలీదు. రేపు నీ కేదైనా సంబంధం వస్తే నీ మీద లక్ష పుకార్లు లేవుతుంది. నువ్వు తట్టుకోగలవా? పోనీ నీ తల్లి తండ్రులు తట్టుకోగలరా? వచ్చిన సంబంధాలు వచ్చినట్టు వెనక్కి తిరిగి పోయేట్టు చేస్తుంది. తట్టుకోగలవా? రజనీష్‌కీ, నీకూ ఉన్న పరిచయాన్ని వాల్‌పోస్టర్ల రూపంలో, గోడ మీద అక్షరాల రూపంలో వికృతంగా చిత్రిస్తుంది. భరించగలవా?



పోనీ, ఆ రజనీష్ నిన్ను ఓదార్చేందుకు వస్తాడా? రాడు. ఎందుకంటే నీతో తిరుగుతున్నట్టు—ఐ మీన్ నీతో స్నేహంగా ఉన్నట్టు—తన కాబోయే మామగారికి తెలిస్తే తనకి వచ్చే కట్నంలో ఒకటో రెండో వేలు తగ్గిస్తాడని భయం. పోనీ ఆ రజనీష్‌నే పెళ్ళాడమని సలహా ఇద్దామంటే ఇప్పటి దాకా అన్నయ్య దృష్టితో చూసిన నువ్వు రేపట్నుంచి మొగుడి దృష్టితో చూడలేవని తెలుసు. ఏ కోణం నుండి చూసినా, నీ బతుకే సమస్యగా కనిపిస్తోంది. అందుకే అతనితో చనువుగా తిరగడం తగ్గించు.'' హెచ్చరిస్తున్నట్టు అంది శైల.

హేళనగా నవ్వబోయింది రాజీ.

నవ్వు రాలేదు.

''చాలా దూరం ఆలోచించి బ్రైన్ వేస్టు చేస్తున్నావ్, శైలా'' అని అనాలనుకుంది.

అనలేక పోయింది.

చిట్టచివరికి నిస్సహాయంగా చూసింది, 'ఇప్పుడేం చెయ్యమంటావ్' అన్నట్టు.

''రాజీ...ఇంకో విషయం. ఇప్పటికి మనుషులుగా ఉన్నవాళ్ళు ఇంకాస్సేపటికి మనుషులుగా ఉండక పోవచ్చు. ఇప్పుడు స్నేహితులుగా ఉన్న వాళ్ళు ఇంకాస్సేపటికి శత్రువులుగా మారిపోవచ్చు. ఏ పరిస్థితులెలా ఎదురవుతాయో ఎవరమూ చెప్పలేము. ఇవాళ నువ్వు 'అన్నయ్యా' అని అభిమానించే రజనీష్ రేపు మరోలా మారిపోవచ్చు. ఎందుకంటే,మనిషి పరిస్థితికి బానిస. అవకాశానికి దాసుడు. 'ఘటన' కు తల వంచే బలహీనుడు.''

''రజనీష్ అలాంటి వాడు కాదు.''

''కానీ అతనూ మనిషేనన్న విషయం మరిచి పోతున్నావ్!''

''మనిషి తన అంతరాత్మకు మాత్రమే బానిసని నే ననుకుంటున్నాను. ఎందుకంటే, అత డేదైనా అంతరాత్మకు విరుద్ధంగా చేస్తే అది అతన్ని అనుక్షణం నీడలా వెంటాడి హింసిస్తుందని తెలుసు. అందుకే మనిషి ఎప్పుడూ తన అంతరాత్మకు బానిసగా ఉండిపోతాడు.'' నిశ్చల స్వరంతో అంది రాజీ.

''నువ్వు చెప్పేది వివేకవంతుల విషయం. ఇప్పుడు వివేకం అనేది చచ్చిపోయి మనిషిలో అవకాశవాదం పెరిగిపోయింది. మనిషి పూర్తిగా పరిస్థితులకు బానిస.''

''అంటే రజనీష్ అవివేకి అనేగా నీ ఉద్దేశం!'' ఉరిమి చూసింది రాజీ.

''అని నే ననట్లేదు. మనిషికీ, పరిస్థితికీ ఉన్న సంబంధం గురించి మాట్లాడాలనుకుంటున్నాను.''

''నువ్వు నూరు చెప్పు. నేను రజనీష్ అంతటి మంచి స్నేహితుణ్ణి వదులుకునేది లేదు. లేదు గాక లేదు.''

ఇలా చాలా సేపు జరిగింది వాగ్వాదం.

చివర్న ఎవరూ గెలవలేదు.

ఎవరూ ఓడిపోలేదు.

ఎందుకంటే, ఎవరూ తాము నమ్మే విషయాల్ని సరిగ్గా పైకి చెప్పుకోలేక పోయారు.

కండక్టరు విజిల్‌తో ఆలోచనల్లోంచి తేరుకుని బయటికి చూసింది రాజీ. అప్పుడే తాను

దిగవలసిన స్టేజీ దాటబోతూంది బస్.

రజనీష్ డోర్ వేపు అడుగు వేస్తూ కనిపించాడు.

• • • •

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం సాయంత్రం ఆరవుతుండగా వెలిసినట్టనిపించి వరండాలో నిలబడి చేయి ముందుకు చాచాడు రజనీష్. ఇంకా తుప్పర పడుతూంది. తన పక్కనున్న రాజీతో అదే మాట చెప్పాడు.

"బహుశా ఇంతకన్నా తగ్గదేమో" అంటూ దూరంగా ఆకాశంలో పర్వతాల మాదిరి పరుగెడుతున్న మేఘాలకేసి చూస్తూ అంది రాజీ.

"నాకూ అలానే అనిపిస్తూంది. ధైర్యం చేసి వెళ్ళిపోవడం మంచిదేమో" అంటూ టిఫిన్ కారియర్ మీద పరుచుకున్న నీటి బిందువుల్ని అరచేత్తో తుడుస్తూ అన్నాడు రజనీష్.

ఇద్దరూ కదిలి రోడ్డుమీది కొచ్చారు.

పాడుబడ్డ ఊరు మాదిరి కనిపించింది రోడ్డు.

ఒక్క చిల్లర కొట్టు లేదు. ఒక దీపం లేదు. ఒక ఊపిరి లేదు.

అప్పటిదాకా కుండపోతగా వర్షం కురవడంతో రోడ్డు పక్కల, రోడ్డు మీద గుంటల్లో నీళ్ళు నిలబడి బస్సులకూ, ఆటోలకూ చోటు కరువు చేశాయి. కనీసం రిక్షాలైనా అవుపిస్తాయేమోనని వెదకసాగారు ఎవరికి తోచిన వేపు వారు— మనసులోపల కనీసం ఒక్క రిక్షా అయినా కనిపిస్తే బావుణ్ణనుకుంటూ.

రిక్షాలు కనిపిస్తున్నయ్. కానీ నిండుగా దొర్లుకుంటూ పోతున్నయ్.

చీమల పుట్టలో నీళ్ళు పోస్తే బయటికి ఉబికి వచ్చే చీమల్లా అస్తవ్యస్తంగా నడుస్తూ, పరుగెడుతూ కనిపించసాగేరు జనం.

అర్ధగంటసేపు బేరమాడందే రిక్షా ఎక్కని వాళ్ళు కూడా బేరమాడకుండా ఎక్కెయ్యడం ఆరంభించేసరికి రిక్షాలకు స్కేర్సిటీ ఏర్పడింది. ఎప్పుడయితే సప్లైకి స్కేర్సిటీ ( కొరత ) ఏర్పడుతుందో వెంటనే ధర పెరగడం అనివార్యతే కాబట్టి, ఆ ధర్మాన్ని అర్థశాస్త్రం పైతం ఒప్పుకుంది కాబట్టి రిక్షాల బాడుగలు తక్షణమే ఆకాశాన్ని అంటినయ్.


పైన ఇంకా మబ్బుగా ఉండేసరికి మళ్ళీ ఓ నాలుగైదు గంటలపాటు వర్షం తప్పదని తోచిన ప్రతి వారూ రిక్షా బాడుగల్ని మరి కాస్త పెంచేసేరు. రిక్షాలు ఎక్కడికక్కడ నిండిపోయి గమ్యాల వేపు సాగిపోయినయ్.

ఒక్క రిక్షా మిగల్లేదు.

ఇంతలో ఆపద్బాంధవుడిలా ఓ ముసలాడు వచ్చేడు రిక్షా లాక్కుంటూ. అతనలా కనిపించేడో లేదో అతన్ని పిలవడం ప్రారంభించేరు ఇంకొందరు గాభరా పడుతూ.

ఎటువేపు వెళ్ళాలో తోచక అక్కడ నిలబడిపోయిన రిక్షా ముసలాణ్ణి చూసి గబగబా అతని దగ్గర కెళ్ళి "సంతపేట మొదటిలైనుదాకా ... ఇద్దరం ... ఏం తీస్కుంటావ్?" అని ఆత్రంగా అడిగేడు రజనీష్.

"ఇద్దరా" అంటూ గడ్డం ఓ క్షణంపాటు




నిమురుకుని "ఆరరూపాయలు" అన్నాడు రిక్షా ముసలాడు.

నెత్తిన ఎవరో కొండ శిఖరంతో మోదినట్లయింది రజనీష్ పరిస్థితి.

"ఆరరూపాయలా ... "

"అవును—ఆరరూపాయలే. ఇంకాస్సేపాగితే ఆరు ఏడవుద్ది..." బెదిరించేడు ముసలాడు.

"ఏం రాజీ?"

"ప్రపంచంలోకెల్లా ఈ రిక్షానే ఉన్నట్టు కంగారుపడతారేం? పదండి—ఇంకాస్త ముందుకెళితే బోల్డు బొచ్చెడు కనిపిస్తాయి." మాటవరసకన్నట్టు అంది రాజీ. కానీ లోలోపలమాత్రం కాస్తంత బెరుగ్గానే ఉంది.

రాజీ మాటకి ముసలాడు పౌరుషం తెచ్చుకుని ముందుకు వెళ్ళబోయాడు.

"ఆగాగు ..." అంటూ వారించబోయేడు రజనీష్.

"ఎందుకు? ఈ రిచ్చా సంతపేటకి రాదు" అంటూ ముందు కెళ్ళి పోయేడు ... రిక్షా ముసలాడు.

"అస లీ రిక్షావాళ్ళని..." 'పరకాలి' అనే అర్థం వచ్చేట్టు దవడలు బిగించేడు రజనీష్.

ఇద్దరూ లోలోపల కించిత్తు బాధపడ్డా మవునంగా ముందుకు నడవసాగేరు.

సన్నగా తుంపర ప్రారంభమయింది.

ఇద్దరూ ఉలిక్కిపడి ఆకాశం కేసి, ఆ తర్వాత ఒకరి మొహా లొకరు చూసుకుని నడవడం ప్రారంభించేరు వడివడిగా.

క్షణాల వ్యవధిలో తుంపర దట్టమైంది.

మమూలైన వాన!

పడక వేగం పెరిగేకొద్దీ వర్షం కూడా పెరగసాగింది.

తనమీద ఎవరో కావాలని కక్ష బూని ఇలా వర్షం రూపంలో తమ పగ తీర్చుకుంటున్నారనిపించింది రాజీకి.

అప్పటికే సగం తడిసిపోయింది రాజీ.

"మైగాడ్! చూడబోతే ఈ వర్షం కొంప ముంచేట్లుంది. రాజీ ...! అదిగో—ఆ ఎరువుల దుకాణం వరండా ఖాళీగా ఉన్నట్లుంది—పద. కాస్సేపు నిలబడి చూద్దాం." అంటూ ఎరువుల దుకాణం ముందర చేరేరు రాజీ, రజనీష్. అప్పటికే అందులో అయిదారుగురు కుర్రాళ్ళు నిలబడి ఉన్నారు ఓ ప్రక్కగా.

తడిసిపోయిన తమ బట్టల్నీ, తలనీ నిమురుకోవడంలో నిమగ్నులై ఉన్న ఆ ఇద్దరికీ తమ ప్రక్కనున్న వాళ్ళ వింత చూపుల్ని పట్టించుకునే వ్యవధి లేకపోయింది. ఓ ఆడ, ఓ మగ కలిసి వస్తోంటే 'ఆ' దృష్టితో తప్ప మరో దృష్టితో చూడలేని నారో మైండెడ్ సొసైటీ మెంబర్లు తమ వెనుక ఉన్నారన్న ఊహ కూడా లేకపోయింది.

అర్ధగంట గడిచిపోయింది.

వర్షం తాయిలంకోసం ఏడ్చే పసిపాప ఏడుపులా తగ్గుతూ, హెచ్చుతూ ఉంది.

చీకటి కాని చీకట్లు కమ్ముకుంటున్నాయి.

స్ట్రీట్ లైట్లు గుప్పున వెలిగి చప్పున ఆరిపోయేయి, ఫస్ట్ పీరియడ్ హాజరు పలికేసిన తర్వాత ఆబ్సెండయ్యే బడిపిల్లల మాదిరి.

పరిసరాల్లో వస్తున్న మార్పుల్ని చూడ్డంలో, ఇంటి దగ్గర పరిస్థితుల్ని ఊహించుకోవడంలో మునిగిపోయిన రాజీ, రజనీష్‌లకు ప్రస్తుత కర్తవ్యం గురించి ఆలోచించే వీల్లేకపోయింది. ఆ ఆలోచన కలిగేసరికి పూర్తిగా చీకటి పడిపోయింది.

వర్షం కురుస్తూనే ఉంది.

వెన్నులోంచి మొదలయ్యే చలి చక్కిలిగింతలు పెడుతోంది.

ప్రక్కన నిలబడ్డ కుర్రాళ్ళు చూసే ఆకలి చూపులకు తట్టుకోలేనట్టు ఇబ్బందిగా చూసి "దగ్గర్లో మీకు తెలిసినవా రెవరైనా ఉన్నారా?" అంది రాజీ.

ఆమె నిస్సహాయతను, అవస్థను గమనించిన రజనీష్, "మావుళ్ళయ్య వీధిలో మా ఫ్రెండొక డున్నాడు. అక్కడిదాకా వెళితే మన ఇష్టం వచ్చినంతసేపు ఉండొచ్చు." వెన్నులోంచి ఎగజిమ్మే చలి అతని మాటల్ని మధ్యలోనే కొరికేసింది.

కురిసే వానని లెక్కచెయ్యకుండా ఓ పది నిముషాలకల్లా మావుళ్ళయ్య వీధిలో ఉన్న ఓ ఇంటి ముందర నిలబడ్డారు రాజీ, రజనీష్.

తలుపు తట్టేడు రజనీష్.

లోపల్నుంచి 'వస్తున్నా' అంటూ ఓ పురుష కంఠం వినిపించింది.

"ఉన్నాడు వెధవ" అంటూ వెనక్కి తిరిగి రాజీవేపు చూసి సంతోషంతో చిర్నవ్వు నవ్వేడు.

తలుపులు బాదిన చప్పుడు విని తలుపులు తీసిన కరుణాకర్‌కి చాలాకాలం తర్వాత కనిపించిన స్నేహితుడు, అతని ప్రక్కన వర్షంలో తడిసి తలొంచుకు నిలబడ్డ రాజీ అదృష్టవంతుల్లా కనిపించేసరికి "లోపలికి రండి" అంటూ ఆహ్వానించేడు.

తలొంచుకునే లోనికి అడుగెడుతున్న రాజీవేపు ఓ సారి ఆశ్చర్యంగా చూసి, రజనీష్ వేపు అభినందనగా చూసి "ఎన్నాళ్ళకు, బ్రదర్ ... మళ్ళీ ఇలా కలుసుకోవడం" అంటూ తలుపులు మూసేసి వారితో పాటే గది మధ్యకు నడిచేడు కరుణాకర్.

గదిలోకి అడుగెట్టగానే స్టాండ్‌కి తగిలించి ఉన్న

టవల్ వోదాన్ని అందుకుని రాజీకి అందించేడు రజనీష్. కృతజ్ఞతగా చూసిందామె. అతడు మరో టవల్‌కోసం వెదుకుతూ ఆ ప్రక్కనే కనిపించిన లుంగీ నో దాన్ని అందుకుని తలకేసి రుద్దుకో సాగేడు.

ఈ లోపు చకచకా డ్రస్ అయిపోయిన కరుణాకర్‌ని పట్టించుకోలేదు రజనీష్. అతను డ్రస్ కావడం గమనించినప్పటికీ మౌనంగా ఉండిపోయింది రాజీ.

తల తుడుచుకుంటున్న వాడల్లా చటుక్కున ఆపి కరుణాకర్ వేపు చూసేడు రజనీష్.

అతడు రెయిన్ కోటు తగిలించుకుంటూ కనిపించేడు.

"ఎక్కడికిరా కరుణా?" అన్నాడు రజనీష్ అతన్ని సమీపిస్తూ.

"ఏం లేదు" అలా హోటల్‌దాకా వెళ్ళొస్తాను." అతి సాధారణంగా అన్నాడు కరుణాకర్ స్నేహితుడి వేపు అపురూపంగా చూస్తూ.

"ఎందుకు ?"

"టీ పట్టుకొస్తాను."

"ప్రస్తుతం మా కలాంటి వేమీ అక్కర్లేదులే." చిరునవ్వు నవ్వుతూ అన్నాడు రజనీష్.

"మీకు అక్కర్లేకపోయినా నా క్కావాలి" అంటూ టేబిల్ సొరుగు లాగి స్కూటర్ తాళాలు తీసుకుంటూ, "ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ గబగబా బైటికి నడిచేడు కరుణాకర్.

వింత ఏమిటంటే, టీకోసం అన్చెప్పి బైటికెళ్తున్న కరుణాకర్ చేతిలో ఫ్లాస్కులాంటిదేమీ లేదు.


రజనీష్ మెదడులో చటుక్కున ఏదో ఫ్లాష్‌లా మెరిసింది.

మరు నిముషం అతని మనసంతా గందరగోళంగా తయారవడం ప్రారంభించింది.

తనని, రాజీని అలా ఒంటరిగా విడిచేసి వెళ్ళడంలో అతడి అంతర్యం అర్థమయ్యే కొద్దీ రజనీష్ హిస్టీరిక్‌గా తయారయ్యేడు. అంతటి ఆందోళన లోనూ అతని పెదవుల మీద సన్నటి తీగెలాంటి చిరునవ్వు ప్రత్యక్షమయింది.

రెండేళ్ళ క్రితం—

తాము కాలేజీలో చదువుకుంటున్నప్పుడు తమ బేచిలో ఉన్న ప్రతి ఒక్కరికీ గర్ల్ ఫ్రెండ్స్ ఉండేవారు. ఆ గర్ల్ ఫ్రెండ్స్ తమతో గడిపేందుకు (ఒంటరిగా) ఛాన్స్ దొరికినప్పుడు ఎక్కడికెళ్ళి ఏకాంతాన్ననుభవించాలో హోపట్టాన అర్థమై చచ్చేది కాదు. అందుకే అందరూ కలిసి హో నిర్ణయాని కొచ్చేరు. అదేమిటంటే, "ఇతరుల డిస్టర్బెన్స్ లేకుండా ఉండేవి ఒక్క (తాము ఉండే ) గదులే. అందువల్ల ఆయా గర్ల్ ఫ్రెండ్స్‌తో గడిపే సమయం చిక్కినప్పుడు తమ తమ గదుల్లో గడపవచ్చు. అందువల్ల పెద్ద ఇబ్బందులేం కలగవు. అయితే— తమలో కొందరు సొంత కొంపలు తప్ప బైట ప్రైవేట్‌గా ఉండడానికి గదులు లేవివా ళ్ళున్నారు. వారి వారి సౌకర్యార్థం వాళ్ళు అడిగినప్పుడు గదులున్న వాళ్ళు ఎటువంటి అభ్యంతరం లేకుండా ఇచ్చెయ్యాలి."




తనకి సొంత ఇల్లు తప్ప అద్దె గది లేనందువ రజనీష్ తన స్నేహితుల గదుల్లో తన గర్ల్ ఫ్రెండ్స్‌తో ఏకాంతం పంచుకోవడం జరిగింది— అప్పట్లో.

'ప్రస్తుతం ఆ భావంతోనే కరుణా గదిలోంచి వెళ్ళిపోయేడా?' అనుకుంటూ కురులు చిక్కు తీసుకుంటున్న రాజీ వేపు అపరాధిలా చూసి హో సారి గాఢంగా నిట్టూర్చి టేబిల్ దగ్గరగా నడిచేడు రజనీష్.

వెనుక తలుపుల్ని రెడ్ల్ని బాదిన చప్పుడయింది.

రాజీ, రజనీష్‌లు ఇద్దరూ ఒక్కసారే వెనక్కి తిరిగి చూసేరు తలుపుల వేపు. బలమైన గాలితోబాటు సన్నటి తుంపర లోనికి పడుతోంది వేగంగా.

ఆ తలుపుల్ని అలాగే వదిలేయడం బాగుండదనుకుని గబగబా వెళ్ళి తలుపుల్ని దగ్గరగా వేసి లోపల గడియ వేస్తూ ఎందుకనో రాజీవేపు చూసేడు రజనీష్.

ఆమె తనవేపే ఆశ్చర్యంగా చూస్తోంది.

మళ్ళీ అతడు టేబిల్‌ను సమీపిస్తుండగా అడిగింది రాజీ, "ఎక్కడికి మీ ఫ్రెండు ... ఇంత వానలో" తుంపుల్లు తుంపులుగా ఉంది మాట.

"వెధవకిట్టే త్రాగాలనిపించిందట. వెళ్ళిపోయేడు." ఏమనాలో తోచక చటుక్కున చెప్పేసేడు తనకు తోచినదీ, నోటికొచ్చినదీ. అయినా అతని మనసులో అనుమానంగానే ఉంది కరుణాకర్ వెళ్ళిపోవడం గురించి. ఇహ అతన్ని గురించి అదేపనిగా ఆలోచిస్తే బుర్ర చెడిపోయేట్టు తోచేసరికి సింపుల్‌గా మనసులోనే "ఏడిశాడు వెధవ" అనుకుంటూ టేబిల్ ముందర కుర్చీలో కూర్చున్నాడు రజనీష్.

టేబిల్ మీద కరుణాకర్ ఫోటో! 'అన్నుడు' తనే తీసింది. ఎంత భద్రంగా ఫ్రేమ్ కట్టించుకు పెట్టుకున్నాడు వాడు!

మళ్ళీ అతని మస్తిష్కంలో అప్పటి రోజులు...

జూనియర్స్‌ని రాగింగ్ చెయ్యడం...

గర్ల్ ఫ్రెండ్స్‌తో కబుర్లాడ్డం, ఏకాంతంగా, విశృంఖలంగా, తనివి తీరేట్టు గడపడం —

ఇప్పుడవన్నీ ఏవీ?

పరధ్యానంగా ఏదో పుస్తకం అందుకున్నాడు రజనీష్.

ఏదో ఇంగ్లీష్ నవల.

పేరు చూసేడు—

ముఖచిత్రం చూసి ఉలిక్కిపడ్డాడు. తన ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ రాజీవేపు చూసేడు దొంగగా.

ఆమెకూడా చూడడంలోనే మునిగిపోయింది— గోడ మీద బొమ్మల వేపు, కాలెండర్ల వేపు, పిచ్చి పిచ్చిగా రాసుకున్న, అంటించుకున్న ఇంగ్లీష్ కొటేషన్ల వేపు.

ఆమె ఒళ్ళు ఒక్కసారిగా జలదరించి, ఆ జలదరింపు తాలూకు కంపనాలు శరీరంలోనే మిగిలిపోయినయ్.

కిటికీ పక్కగా గోడమీద నిలువెత్తు బొమ్మ— ముప్పాతిక భాగం నగ్నంగా—మొదట అసహ్యించుకుంది. అయినా చూసింది. మళ్ళీ అసహ్యించుకుని ఈ సారి చూడకూడదని గట్టిగా ఒట్టేసుకుని బలవంతంగా, క్యూరియస్‌గా గోడమీది మిగతా బొమ్మల వేపు తేరి పార చూడసాగింది.

అవీ దాదాపు అలాంటివే.

ఒక చోట క్లోజప్‌లో ప్రేయసి పెదవుల మీద ముద్దిడుతున్న ప్రియుడి ఫోటో—మరో చోటనగ్నంగా మారియా ష్నైడర్ స్పైడర్ యాంగిల్‌లో— ఇంకో చోట బిగిసిపోయిన కౌగిట్లో లోకాన్నే మరిచిపోయిన ఒక యవ్వనపు జంట— మరో చోట సముద్రపు ఒడ్డున ఏకమైన ఒక జంట సిల్హౌట్...

ఇలా రకరకాలుగా—గోడల నిండా! ఇవిగాక శృంగార భరితమైన స్నిప్పెట్స్.

చూడకూడదనుకుంటూనే మొత్తాన్ని పరిశీలనగా చూసింది రాజీ.

రాజీ మనసులో ఒక చైతన్యం.

రాజీ మనసులో ఒక అసహ్యం.

రాజీ మనసులో ఒక చాంచల్యం.

రాజీ మనసులో ఒక భయం.

రాజీ మనసులో ఒక గిల్టీ కాన్షస్‌నెస్!

రాజీ మెదడులో ఒక ప్రేలుడు, ఆక్రందన!

అనుకోకుండా కంగారుగా రజనీష్ వేపు చూసింది రాజీ. ఆమె తన వేపు చూడ్డం గమనించి చిన్నగా నవ్వుకుంటూ చేతిలోని పుస్తకం పేజీల్ని తిప్పసాగాడు రజనీష్.

అతను పుస్తకాన్ని చదవట్లేదు. కేవలం చూస్తున్నాడు.

అప్రయత్నంగా ఒక పేరాగ్రాఫ్ మీద ఆగిపోయింది దృష్టి.

'ఫర్ ఎ మొమెంట్ దే స్టుడ్ అబ్సొల్యూట్లీ స్టిల్. దే సీమ్డ్ సస్పెండెడ్ ఇన్ టైమ్, యాజ్ డిడ్ ది ఫేడెడ్ బ్యూటీ ఆఫ్ ది రూమ్, ఐసోలేటెడ్ ఫ్రమ్ ది వరల్డ్ అండ్ దెయిర్ వోన్ సెపరేట్ లైవ్స్...'

ఇదేమిటి ఇలా ఉంది? ప్రస్తుతం తమ పరిస్థితీ దాదాపుగా అంతేగా. (అంతేనా? బహుశా అంటే...? అయ్యుండొచ్చు.)

"హి సెట్ హర్ డౌన్, బట్ హిజ్ పవర్ఫుల్ హేండ్స్ డిడ్ నాట్ రిలీజ్ హర్, పుల్లింగ్ హర్ టు హిమ్ అండ్ హెల్టింగ్.హర్ పెండ్యులన్ బ్రెస్ట్స్..."

ఉలిక్కిపడ్డాడు రజనీష్.

అప్పుడు నిద్ర లేచింది అతనిలో అంతర్లీనమైన చైతన్యం.

రాజీనే తదేకంగా చూస్తున్నాడతను. ఆమె వేపు చూస్తున్నట్టు అతనికే తెలీని పరిస్థితి.

వర్షంలో తడిసిన తలనైతే కొంతవరకు తుడుచుకోగలిగిందేమో కాని ఒంటిమీద తడిసి ఉన్న (అవయవాలకు అతుక్కుపోయి పారదర్శక వస్త్రంగా మిగిలిన) చీరెను మార్చుకోలే దామె. మార్చుకునేందుకు వీల్లేదుకూడాను. ఒక వేళ చీరె మార్చుకునే అవకాశం ఉన్నా అందుకు తగిన ధైర్యం చేసే ధైర్యం ఆమెలో లేదు. అందుకే ఆమె చీరె మార్చుకో లేదు. చీరె తడి ఆర్చుకోనూ లేదు.

చీరె వెనక దాక్కున్న రాజీ అస్పష్టంగా కనిపిస్తోంది.

అతని మెదడులో వో చీలిక.

చటుక్కున ఆమె మీంచి దృష్టి మరల్చి పుస్తకం వేపు సారించాడు.

'దెన్ హి అన్‌బటన్డ్ విత్ స్పీడ్ అండ్ అడెప్ట్‌నెస్ అండ్ స్లిప్డ్ బోత్ హేండ్స్ ఇన్సైడ్ క్రేడిలింగ్ హర్, హి అవుట్ లైన్డ్ హర్ విత్ హిజ్ థంబ్స్...'

ఛీ. ఛీ!


పుస్తకం మూసేస్తూ, కళ్ళు మూసుకున్నాడు రజనీష్ నిస్సహాయంగా.

కళ్ళు మూసుకోగానే కళ్ళ వెనక దాక్కుని తొంగి చూస్తున్న కాలేజీ రోజులు కళ్ళ ముందర విలయ తాండవం చెయ్యసాగాయి.

కళ్ళు తెరిచాడతను. గోడల వేపు చూడసాగాడు. రాజీ తేరి పార జూచినదీ అవే బొమ్మల్ని.

బైటికి చూద్దామనుకున్నాడు. కిటికీ మూసేసి ఉంది.

ఎటూ పాలుపోక రాజీ వేపు చూశాడు రజనీష్. మెదడులో సంభవించిన విస్ఫోటం తాలూకు



— ఇ. పద్మిని ప్రియదర్శిని

శకలాలు అతని కళ్ళలో ఎర్రగా మెరుస్తున్నయ్.

రాజీ అతని దగ్గరకే వచ్చి నిలబడింది. తమ మధ్య పరుచుకున్న భయంకరమైన మౌనాన్ని, అసహ్యమైన నిశ్శబ్దాన్ని సహించలేక పోయిం దామె. ఏదో ఒకటి మాట్లాడితే తమ మధ్య ఉన్న అగాధం పూడిపోతుందని ఆమె భావం. అందుకే అతన్ని సమీపించింది ఎప్పటి నవ్వునే అప్పుడూ నవ్వుతూ.

అతడి మెదడులో మళ్ళీ విస్ఫోటం.

అతడి కళ్ళు వింతగా మెరుస్తున్నయ్.

నరాల్లో సన్నని కంపన.

ఆమెవేపు చూస్తుంటే రక్తనాళాల్ని ఎవరో చురకత్తులతో కోసేస్తున్నట్లు, గుట్టలు గుట్టలుగా పడేస్తున్నట్లు ఒకటే సంచలనం, చాంచల్యం.

బలవంతంగా ఆమె మీంచి చూపు మరల్చి పుస్తకం పేజీలు తిప్పసాగేడు యాంత్రికంగా.

'హి ప్రెస్డ్ హర్ ఎగనెస్ట్ ది వాల్ ఎండ్ ...'

ఆ పైన చదవలేకపోయేడు... అయినా చదవాలనిపించింది.

'దే శాట్ ఆన్ ది బెడ్ ఫేసింగ్ ఈచ్‌అదర్ ఎండ్ ఎక్స్‌ట్యెన్డ్ దెయిర్ లెగ్స్ ...'

అతని గుండెలో చురకత్తి పెట్టి మెలి త్రిప్పినట్టయింది. అయినా అతడి మెదడులో కరుణాకర్ బైటికెళ్ళడం, 'వాడే' వెళ్తూ వెళ్తూ తనవేపు చూసిన చూపు, నవ్విన నవ్వు (ఆ చూపు, నవ్వుల అర్థం ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది), కాలేజీ రోజులు, గర్ల్ ఫ్రెండ్స్, తమ గదుల కేటాయింపు, ఏకాంతాలు, అల్లర్లు, చిలిపిచేష్టలు, నగ్నంగా కాకపోయినా దాదాపు అలానే అనిపిస్తూ ఎదురుగా ఉన్న రాజీ ... వోహ్! మైగాడ్!

"మీ ఫ్రెండ్ కింకా పెళ్ళి కానట్టుందే ..." దంతపు దువ్వెనతో కురుల్ని సరిచేసుకుంటూ అంది రాజీ.

ఆమె ముఖం సగభాగాన్ని ఆక్రమించిన నల్లని వెంట్రుకలు, వెంట్రుకల మాటు నుంచి సగం మాత్రమే కనిపిస్తున్న వెడల్పాటి కుడికన్ను ... ఆ క్షణాన అతన్ని కవ్విస్తున్నట్టు అనిపించిందది.

నిరామయంగా ఆమెనే చూస్తూండి పోయేడు రజనీష్.

అతన్నుంచి సమాధానం లేకపోవడం, అతని చూపులో ఏదో మార్పు గోచరించడం రాజీని కొద్దిగా కలవరపెట్టేయి.

అతన్నే చూడసాగిం దామె, నిశ్చేష్టురాలై!

అతనూ అలాగే చూస్తున్నాడు, పట్టి పట్టి!

అతని మెదడులో అస్పష్టపు మేలుకొలుపులు, తెరచుకుంటున్న తలుపులు, మనసు పొరల వెనుక జ్ఞాపకాల మెరుపులు! సుఖం—సంతోషం— బాధ—సందడి— గాజుల సవ్వడి — తియ్యటి బాధా పూరితమైన విట్కారు.

అతనిమీంచి దృష్టి మరల్చి ఎటో చూడసాగిం దామె.

ఆమె కళ్ళు చివరత్లో ఆ గదిలో తాను చూసిన కేలండర్లు, తైలవర్ణచిత్ర సమూహాలు ...సముద్రం లాంటి వూహలు...ఎక్కడిదో వో కెరటం పరుగెత్తుకుంటూ వచ్చి శతకోటి కెరటాలుగా విడిపోయి తనని బలంగా మోదినట్టు—తనలోని నీరసం మరింత నీరసపడిపోతునట్టు—నిస్సహాయత మరీ నీరస పడిపోతున్నట్టు ...

మళ్ళీ కంగారుగా అతని వేపే చూసింది.

అతడు నడిచి వస్తున్నాడు — తనవేపే.

ఆమెలో భయం లేదు, చలనం లేదు—కానీ ఏదో భావ సంచలనం.

అలాగే నిలబడి ఉంది స్థాణువులా.

అతను తనకు దగ్గరవుతున్నట్టు తెలుసు. అలా దగ్గర కావడానికి పర్యవసానం ఏమిటో అతని మొహంలోని భావాల్ని బట్టి చెప్పగలదు. తమ రెండు శరీరాలు ఒక్కటైనచోట అగ్ని సరస్సు వికసిస్తుందని, ఆ అగ్ని సరస్సులోని కెరటాల్లో పడి క్షణాలు, గంటలు, జీవితపు అపురూప సంపదలు సర్వమూ శిథిల మవుతాయని తెలుసు. అయినా ఆమె అలాగే నిల్చుని ఉంది.

రజనీష్ 'అటువంటి వాడు' కాదు. "అన్నయ్యా" అని నోరార పిలిస్తే అతన్లోని కదలిక, అగ్ని వాయువుల కలయిక నిశ్శబ్ద మవుతాయి. నిర్వీర్యమైపోతాయి. ఆమె ఆలోచిస్తోంది. ఆమె పెదవుల్నీ, నాలుకనీ,గొంతుకనీ, వివేకాన్నీ లాగేసి ఎవరో దూరంగా దిక్కుల్లోకి విసిరేసేరు.

ఆమె మెదడు మొద్దుబారిపోయినట్లుంది.

అతను పూర్తిగా దగ్గరయ్యేడు.

అప్పుడు తప్పుకోబోయిం దామె.

నిష్ప్రయోజనం! అప్పటికే అతను బలంగా కావలించుకున్నా డామెని.

ఆమెలో కనీసం సున్నితంగానైనా ప్రతిఘటన లేదు.

అతని పెదవులు ఆమెను మాట్లాడనివ్వలేదు.

ఆమెలో తిరస్కారం లేదు — అది ఆమె తప్పు కాదు.

అతను విపరీతంగా రెచ్చిపోయాడు — అది అతని తప్పు కాదు.

ఆమెను పువ్వులా నిమురుతూ, అమృతంలా త్రాగే

స్తున్నా డతను. అదీ అతని తప్పు కాదు. కిమ్మనకుండా అరమోడ్పు కళ్ళతో అతన్ని తీగెలా అల్లుకుంటోం దామె. అదీ ఆమె తప్పు కాదు— కాస్సేపయ్యేక ..

లోకం "తప్పు" అనే తప్పు ఆ గదిలో జరిగి పోయింది, ఎవరి ప్రమేయమూ లేకుండానే.


● ● ● ●

టైమెంతయ్యిందో సరిగ్గా తెలీదు.

బైట వర్షం వెలిసి చాలాసేపయింది. గదిలో వో మూలన్న కూర్చున్న రాజీ కళ్ళు వయసులో ఉన్న వర్షామేఘాల్ని గుర్తుకు తెప్పిస్తున్నయ్.

లయ తప్పిన ఆమె శిల్ప భంగిమలో ఒక దైన్యం, ఒక స్తబ్దత!

ఆమె ఎదురుగా కుర్చీలో కూర్చున్న రజనీష్ ముందుకు వంగుతూ అన్నాడు—"రాజీ ... నేను కావాలని ఈ తప్పు చెయ్యలేదు. నా వల్ల ఏదైనా పొరపాటు జరిగిందీ అంటే అది కేవలం యాదృచ్ఛికం మాత్రమే. ఇది నేను నీ నుంచి తప్పుకోవడానికి,




నీ కన్నీటి నుంచి దూరంగా పారిపోవడానికి అంటున్న మాటలు కావు. నేను మనఃస్ఫూర్తిగా అంటున్న మాటలు."

ఆమె ఏడుస్తోంది.

అతడు కంటిన్యూ చేశాడు. "దేవుడనే వాడి మీద నీకు నమ్మక ముంటే ఆ దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. మనం ఈ గదిలో అడుగు పెట్టేంతవరకూ నీ పట్ల నాలో ఎటువంటి దురాలోచనా లేదు. కానీ మన ఇరువుర్ని గదిలో ఒంటరిగా వదిలేసి కరుణాకర్ ఎప్పుడయితే బయటి కెళ్ళిపోయాడో సరిగ్గా అప్పటినుంచే నాలో ఏదో సంచలనం ప్రారంభమయింది. గతించి పోయిన కాలేజీ జీవితం, అప్పటి జీవన విధానం కళ్ళలో మెదిలింది. కళ్ళలో మెదలడమే కాదు, గుండెను కదిపింది. గుండెను కదపడమే కాదు మొత్తం మనిషినే తల్ల కిందులు చేసింది. అదే సమయానికి యాదృచ్ఛికంగా నా చేతికి దొరికిన ఈ పుస్తకం—ఈ పుస్తకంలోని

కొన్ని లైన్ల కారణంగా అంతశ్చేతనలో రగిలిన అగ్ని విస్ఫోటనం. గోడల మీద అర్ధనగ్నంగా బొమ్మలు, కేలండర్లు. ఆ క్షణంలో నాలో ఇవే ప్రతిధ్వనించి, ప్రతిఫలించినయ్ కానీ ఇన్నాళ్ళుమవ్వునన్ను అన్నయ్యా అని పిలిచినపిలుపు కానీ, అందరి లాంటి వాణ్ణే కాదన్న భావంతో నా కిచ్చిన గౌరవం, చూపిన అభిమానం, పంచిన ఆదరణా ఏవీ గుర్తుకు రాలేదు. ఒకే ఒక్కటి మేఘంలా మనసును కప్పేసింది. కామం' ఆపాడు. అతని మొహంలోని భావం చటుక్కున మారిపోయింది. "నేనేనం టేపరే మగాణ్ణే, కామంతో కళ్ళు మూసుకుపోయి నిన్ను కౌగిలించుకున్నా ననుకో. వివేకం గలదానివి నువ్వు. నువ్వెందుకని ప్రతిఘటించలేదు. కనీసం ఒక్క పరుషమైన మాటైనా ఎందుకని అనలేదు?"

అతని మాటలకే కాబోలు ఆమె ఏడుపు రెట్టింపు అయింది.

"అవును! నువ్వు మామూలు మనిషివేగా. మానవ సహజమైన వాంఛలకీ, బలహీనతలకీ నువ్వూ బానిస వేగా. బహుశా అందుకే ప్రతిఘటించలేకపోయి ఉంటావు. అవును కదూ. రాజీ! నీకు మరోసారి గుర్తు చేస్తున్నాను. ఇప్పుడు జరిగిన ఈ తప్పు నిజంగా తప్పే కనక అయితే ఆ తప్పుకు మనం ఎంత మాత్రమూ బాధ్యులం కాము. నా మాటల్లో ఎస్కేపిజమ్‌ను వెదకొద్దు. ఇది వాస్తవం! కేవలం ఇది యాక్సిడెంటల్. యాదృచ్ఛికం."

ఏడు పాపం దామె.

ఆలోచనలో పడింది.

'అవును. అతను చెప్పేది నిజమే. మబ్బులు పట్టడం యాదృచ్ఛికం. వర్షం కురవడం. ఒక వేళ కురిసినా ఇంత విపరీతంగా కురవడం యాదృచ్ఛికం. అందులో తాము బంధింపబడటం యాదృచ్ఛికం. రిక్షాలు కానీ, ఆటోలు కానీ సమయానికి దొరక్క పోవడం...ఒక వేళ దొరికినా వాటిని వదలుకోవడం యాదృచ్ఛికం. తామిద్దరూ ఈ గదికి రావడం యాదృచ్ఛికం. ఇక్కడ అనుకోని పరిస్థితులు ఎదురు కావడం యాదృచ్ఛికం. ఆ పరిస్థితుల్లో తమ తమ బలహీనతలు మరింతగా బలహీనమవడం యాదృచ్ఛికం బలపడిన బలహీనతల తాకిడికి తట్టుకోలేక తాము తప్పు చెయ్యడం యాదృచ్ఛికం. అంతరాత్మను అధిగ మించి పరిస్థితులకు తను తలఒగ్గటం యాదృ చ్ఛికం ( ఆశ్చర్యంకూడా ). అసలు మనిషి పుట్టుకే యాదృచ్ఛికం' పిచ్చిగా నవ్విం దామె.

అయినా రాజీ కళ్ళలో కన్నీళ్ళు—పలచగా.

ఆ కన్నీటి బిందువుల మీద నింపబడిన శైల నల్లకోటు చేతిలో పట్టుకుని వాదిస్తోంది. "యువ రానర్. మనిషి పరిస్థితులకు పూర్తిగా బానిస. జరిగిన ఈ తప్పుకు ఏ ఒక్కరూ బాధ్యులు కారు. బాధ్యులైతే ఇద్దరూ అందుకు బాధ్యులే."

ఆ వాదనకు ఎదురు లేదు. ఎందుకని ఎదురు లేదు. మనిషే అలా లేకుండా చేసుకున్నాడు కనక.

శైలా! నువ్వన్నదే నిజమనిపిస్తోంది. మనిషి అంతరాత్మకన్నా పరిస్థితికే ఎక్కువగా బానిస. ఇది నేను అనుభవంమీద తెలుసుకున్న విషయం. నువ్వూ ఈ అనుభవానికి గురయ్యావో లేదో తెలియదు కానీ నువ్వన్నది మాత్రం అక్షరాలా నిజం. మనిషి పూర్తిగా పరిస్థితులకు బానిస. ఈ సత్యాన్ని కాస్తంత ఆలస్యంగా ఒప్పుకున్నందుకు కాలం అప్పుడే నాకు శిక్ష విధిం చింది.'

తలొంచుకుని తలుచుకు తలుచుకు ఏడుస్తోంది రాజీ.

"రాజీ! ఇప్పుడు ఏడిచినందువల్ల ప్రయోజనం లేదు. జరిగిన తప్పు దారుణ పరిణామాలకు దారి తీయ కుండా చూసుకోవాలి. లే. ఇంటి కెళదాం." ఆమె రెక్క పుచ్చుకుని పైకి లేవనెత్తాడు రజనీష్.

సిగ్గుతోనో, అభిమానంతోనో, దుఃఖంతోనో ఆమె మరింతగా కుంచించుకు పోయింది.

సరిగ్గా అప్పుడే బయట స్కూటర్ ఆగిన చప్పుడయింది.

ఇద్దరూ ఎర్రబడ్డ కళ్ళతో గుమ్మంవేపు చూశారు.

ఎవరి సహాయం అక్కర్లేకుండానే మెల్లగా పైకి లేచింది రాజీ. ఆమె చెయ్యి పుచ్చుకుని గుమ్మం వేపు నడిచాడు రజనీష్.

గుమ్మంలోకే ఎదురయ్యాడు కరుణాకర్.

బాగా తాగినట్టున్నాడు మనిషి తూలుతున్నాడు. చేతిలో ఏవో పొట్లాలు ఉన్నయ్.

అతన్ని చూసి రజనీష్ మెదడులో మళ్ళీ పాత రోజులు...కాలేజీలో చదువుతున్నప్పుడు. గదులు... గర్ల్ ఫ్రెండ్స్. షికార్లు. ఏకాంతాలు.

"ఐ థింక్." అంటూ ఇంకా ఏదో అనబోయాడు కరుణాకర్, అరమూత కళ్ళతో. కానీ అతని చెంప చెళ్ళు మనడంతో తన ప్రాణమిత్రుడు రజనీష్ తనని అసహ్యంగా వెక్కి తోసెయ్యడంతో అతని మాట సరిగ్గా గొంతు దాటలేదు.

ఇదీ యాదృచ్ఛికమేనా? ★

( లాస్ట్ టాంగోయిన్ పారిస్" నవలా రచయిత, ఈ కథారచనకు ప్రేరణ నిచ్చిన రాబర్ట్స్ అలీకి కృతజ్ఞతలతో. రచయిత)